BIBLE
316

# బైబిల్ అంటే ఏమిటి?

**బైబిల్ అంటే ఏమిటి?** దేవుడు మీతో మాట్లాడటం. అది దేవుని గురించి చెప్పేది మాత్రమే కాదు. అది దేవుని నుండి వచ్చినది. అది స్ఫూర్తినిచ్చేది మాత్రమే కాదు. దేవుని ప్రేరణ (దేవుని చేత ఊదబడింది) వలన కలిగినది. దానిని చదవండి. దానిని వినండి. దాని గూర్చి ఆలోచించండి. దాని నుండి నేర్చుకోండి. దానిని మీ జీవితానికి అన్వయించుకోండి. *"క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి"* అని అపొస్తలుడైన పేతురు 1 పేతురు 2:3లో రాసాడు.

**బైబిల్ ను ప్రత్యేకమైనదిగా చేసేది ఏమిటి?** దానిలోని 66 పుస్తకాలు మూడు భాషల్లో (హెబ్రీ, అరమెయిక్, మరియు గ్రీకు), 40 కంటే ఎక్కువ మంది చేత 1,600ల సంవత్సరాల కాలవ్యవధిలో ఒక్కటే సాధారణ మరియు స్థిరమైన అంశము గూర్చి అనేక శతాబ్దాలుగా జరిగిన విషయాలు రాయబడ్డాయి. 5,000 పూర్తి లేదా సగభాగం కలిగిన పురాతన ప్రతులద్వారా క్రొత్తనిబంధన నిబద్ధత నిర్ధారించబడింది. బైబిల్ యొక్క ఖచ్చితత్వం అందులోని ప్రవచనాల నెరవేర్పు, ఆధునిక పురావస్తు ఆవిష్కరణలు, భౌగోళిక ఖచ్చితత్వం, మరియు సామెతల గ్రంథంలోని కాలాతీతమైన జ్ఞానోక్తుల ద్వారా ఋజువు చేయబడుతుంది. రాయబడిన పుస్తకాలన్నిటిలో బైబిల్ అత్యంత ప్రాముఖ్యమైనది మరియు ప్రభావవంతమైనది. మరే పుస్తకం ఇంత ఎక్కువ ప్రతులతో ముద్రించబడి, పంపిణీ చేయబడి, ఇన్ని భాషల్లోనికి అనువదించబడి, ఇంతమంది జీవితాలను అంత శక్తివంతంగా ప్రభావితం చేస్తూ ఇన్ని శతాబ్దాలు తట్టుకొని నిలబడలేదు. బైబిల్ మాత్రమే మనం నమ్మవలసిన మరియు మన జీవన శైలి పట్ల అంతిమ అధికారం కలిగినది. అన్ని పుస్తకాల పై ఉన్నతంగా నిలవగల పుస్తకం బైబిల్ మాత్రమే.

**బైబిల్ యొక్క గుణలక్షణాలు ఏమిటి?**

బైబిల్ దేవుని శ్వాస వలన కలిగినది. *"దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము,"* 2 తిమోతి 3:16.

బైబిల్ సత్యమైనది. *"సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము,"* అని యోహాను 17:17లో యేసు ప్రార్థించాడు.

బైబిల్ సూక్ష్మ విషయాల్లో కూడా ఖచ్చితత్వం కలిగి ఉంటుంది. *"ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పి పోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను,"* అని మత్తయి 5:18లో యేసు చెప్పాడు. ప్రాథమిక ప్రతుల యొక్క ఖచ్చితత్వం ఎంతగా భద్రపరచబడినదంటే నేటి అక్షరార్థ అనువాదాలు 99% ఖచ్చితత్వాన్ని కలిగి ఉన్నాయి.

బైబిల్ స్వచ్ఛమైనది. *"యెహోవా మాటలు పవిత్రమైనవి అవి మట్టిమూసలో ఏడు మారులు కరగి ఊదిన వెండి యంత పవిత్రములు,"* కీర్తనలు 12:6.

బైబిల్ నిత్యమైనది. *"గడ్డి యెండిపోవును దాని పువ్వు వాడిపోవును మన దేవుని వాక్యము నిత్యము నిలుచును,"* యెషయా 40:8. బైబిల్ మొదటిగా రాయబడినప్పుడు ఏవిధంగా మానవ అవసరతలకు తగినట్లుగా ఉండేదో ఇప్పుడు కూడా అదేవిధంగా ఉంటుంది.

బైబిల్ శక్తివంతమైనది. హెబ్రీ 4:12, *"ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభ జించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది."*

**బైబిల్ నుండి ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనాలు కలుగుతాయి?**

బైబిల్ మనలను సిద్ధపరుస్తుంది. *"దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది,"* 2 తిమోతి 3:16-17.

బైబిల్ మనం పాపం చేయకుండా సహాయపడుతుంది. కీర్తనలు 119:9, 11 దీనిని ఎలా చేయాలో మనకు తెలియజేస్తుంది. *"యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచు కొందురు? నీ వాక్యమునుబట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా? నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను."*

బైబిల్ నేటికి అవసరమైన నడిపింపును (తరువాతి అడుగు వేయటానికి) మరియు భవిష్యత్తు కొరకు దిశానిర్దేశాన్ని (మనం వెళ్లవలసిన త్రోవ) మనకు సూచిస్తుంది. *"నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది,"* కీర్తనలు 119:105.

బైబిల్ తెలివినిస్తుంది. *“నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగుకలుగును అవి తెలివిలేనివారికి తెలివి కలిగించును,”* కీర్తనలు 119:130. పాతనిబంధనలోని సామెతల గ్రంథంలో కాలాతీతమైన జ్ఞానం దొరుకుతుంది.

కష్టకాలంలో బైబిల్ మనకు సహాయపడుతుంది. *“నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది,”* అని కీర్తనలు 119:50 మనలను ప్రోత్సహిస్తుంది.

బైబిల్ నిరీక్షణ యిస్తుంది. *“ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి.”* రోమా 15:4.

బైబిల్ సమాధానం ఇస్తుంది. *“నీ ధర్మ శాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదువారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియులేదు,”* అని కీర్తనలు 119:165 వాగ్దానం చేస్తుంది.

బైబిల్ ఆనందాన్ని ఇస్తుంది. *“నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి,”* అని యిర్మీయా 15:16 ఉదాహరణనిస్తుంది.

**మనం బైబిల్ ఎలా చదవాలి లేదా వినాలి?** ఒకటికంటే ఎక్కువ వచనాలను పరిశీలించండి. “దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది,” 2 తిమోతి 3:16 యొక్క నాలుగు ఉద్దేశాలను గమనించండి. మీరు చదువుచుండగా లేదా వింటూండగా, ఈ నాలుగు ప్రశ్నలను అడగండి. ఇది నాకు ఏమి ఉపదేశిస్తుంది? ఇది నన్నెలా ఖండిస్తుంది? నేను ఎటువంటి విషయాల్లో తప్పుదిద్దుకోవాలి? నేను మరింత నీతిగా బ్రతకడానికి ఇది నన్ను ఏవిధంగా తర్ఫీదు చేస్తుంది?

**నా వద్ద బైబిల్ లేకపోతే ఏమిచేయాలి?** బైబిల్ యొక్క మంచి అనువాదాన్ని కొనుక్కోవడానికి చేయగలిగినంత ప్రయత్నం చేయండి. మీరు కొనలేకపోతే, ఆన్లైన్లో చదువుకోవడానికి లేదా వినడానికి మీకు చాలా అందుబాటిలో ఉంటాయి. ఒక స్నేహితుడు లేదా మరింతమంది స్నేహితులతో కలిసి కొని దానిని అందరూ పంచుకోవడానికి ప్రయత్నం చేయండి. లేదా మీ సంఘం లేదా లేదా సహవిశ్వాసులలో ఒకరిని బైబిల్ చదవమని చెప్పి అందరూ జాగ్రత్తగా ఆలకించండి. *“దేవుని వాక్యము విని దానిని గైకొనువారు [విధేయత చూపించి దాని ప్రకారం జీవించుట] మరి ధన్యులని చెప్పెను,”* లూకా 11:28.

**బైబిల్ బోధకులు మరియు నాయకుల కొరకు కొన్ని ప్రత్యేక వచనాలు ఏమిటి?** వాక్యంలో నిలిచి ఉండుట (జీవించుట) ద్వారా యేసుకు శిష్యులుగా ఉండండి. *“కాబట్టి యేసు, తనను నమ్మిన యూదులతో—మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు,”* యోహాను 8:31. యోగ్యులుగా నిరూపించుకోవడానికి బైబిల్ అధ్యయనం చేయండి. *“దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము.”* 2 తిమోతి 2:15.

**బైబిల్ ఎందుకు నిత్య ప్రాముఖ్యత కలిగియుంది?** అపొస్తలుడైన యోహాను తన సువార్తను రాయడంలో తన ఉద్దేశాన్ని వివరిస్తున్నాడు. ఆ ఉద్దేశం బైబిల్ అంతటికీ అన్వయించవచ్చు. *“మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను,”* యోహాను 20:30-31. యేసునందు మీరు ఎలా విశ్వాసం కలిగి నిత్యజీవం పొందగలరు? www.Gospel316.org సందర్శించి దానిని తెలుసుకోండి.

**“గడ్డి యెండిపోవును దాని పువ్వు వాడిపోవును మన దేవుని వాక్యము నిత్యము నిలుచును.” యెషయా 40:8.**

---

John D. Morris III రచించిన *బైబిల్ అంటే ఏమిటి?* © 2025, Act One Eight చేత ప్రచురించబడింది. మీరు ఈ పూర్తి వివరణ ఇస్తూ ఇందులో ఎటువంటి మార్పులు చేయనట్లైతే, దీనిని ఉచితంగా ముద్రించవచ్చు, కాపీ చేయవచ్చు, పోస్టు చేయవచ్చు, ఈ-మెయిల్ లేదా మెసేజ్ చేయవచ్చు. మీ పరిచర్య లేదా సంఘం పేరు లేదా లోగోను మొదటి పేజీ పైభాగంలో మరియు సంప్రదించడానికి కావలసిన వివరాలను రెండవ పేజీ క్రింద ప్రక్కన మందపాటి లైనుకు పైన ముద్రించవచ్చు. Bible316 బైబిల్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు యేసు క్రీస్తునందు విశ్వాసం ఉంచి ఆయన శిష్యులుగా అభివృద్ధి చెందటానికి సహాయం చేసేందుకు ఇది నడిపించబడుచున్నది. మీరు (వీలైతే ఇంగ్లీషు భాషలో) మాకు ఈ-మెయిల్ చేయగలిగిన చిరునామా: Hello@Mail316.org. అనువాద సహకారం అందించినవారు www.ChristianLingua.com. బైబిల్ అంటే ఏమిటి? www.Bible316.org లో 48 భాషల్లో ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఆంగ్ల వర్షన్లో ఉన్న బైబిల్ ఉద్ధాటనలు The Lockman Foundation’s New American Standard Bible 1995 నుండి సేకరించబడినవి. ఈ అనువాదం కొరకు బైబిలో ఉద్ధాటనలు బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి తెలుగు ఓల్డ్ వర్షన్ నుండి సేకరించబడినవి.